
# విశాల

—అయ్యగారి సుబ్బలక్ష్మి



విశాల చేస్తున్నపని వదిలేసి ఒక్క ఉదుటున వీధి గుమ్మం దగ్గరికి వచ్చి, లోపలికి  వస్తున్న భర్త రామనాథం చేతిలో బ్రీఫ్ కేస్ అందుకుంది.

"నిన్నవే వస్తానన్నారు – రాలేదేమిటాని ఎదురు చూస్తున్నాను. అందరూ కులాసాయే కదా?!" అంది అతనితోపాటు లోపలికి నడుస్తూ.

"ఆ! అందరూ కులాసాయే! శశికే కొంచెం బాగోలేదు" అన్నాడు కొంచెం దిగులుగా.

"ముందు మొహం కడుక్కోండి. కాఫీ తాగుతూ మాట్లాడుకోవచ్చు" అంటూనే వంటింట్లోకి నడిచింది కాఫీ తీసుకురావడానికి.

కాఫీ తాగుతూ చెప్పాడు రామనాథం తన చెల్లెలి కుటుంబ విషయాలు.

"దాని పరిస్థితే బొత్తిగా బాగోలేదు. అదేం ఖర్మో! బావగారు ఏది పట్టుకుంటే అదే మట్టయిపోతోంది. రోజులు అతికష్టం మీద లాక్కొస్తున్నారు. ఈ మధ్య గోరుచుట్టు మీద రోకలి పోటులా దాని ఆరోగ్యం బాగా దెబ్బ తింది. నాతో రమ్మన్నాను నాలుగు రోజులుండి – ఆరోగ్యం కుదుట పడ్డాక పంపిస్తానని చెప్పాను. అది లేకపోతే ఆ ఇల్లు ఆ మాత్రం కూడా జరగదని రానంది. అసలు దాని కొడుకుని తీసుకువచ్చేద్దామనుకున్నాను. వాడు అక్కడ చదువూసంధ్యా లేకుండా గాలికి తిరుగుతున్నాడు. వాడినైనా ఒక దారికి తెస్తే –

శశికి కాస్త సాయం చేసినవాళ్ళమవుతాం! శశి మొదట ఒప్పుకోలేదు. చివరికి 'ఇంటికి వెళ్ళి ఉత్తరం రాయి. అప్పుడు పంపిస్తాము' అంది" అని ఆగాడు విశాలని సాభిప్రాయంగా చూస్తూ.

విశాల మొహంలో క్షణంలో చోటుచేసుకున్న – అసహనాన్ని చూసి విస్తుపోయాడు రామనాథం.

"మీ చెల్లెలు చాలా తెలివిగలది. ఇంటికెళ్ళి ఉత్తరం రాయి అంటే –'మీ ఆవిడకి ఇష్టం అయితే రాయి' అని అర్థం. ఇప్పుడు రాయకపోతే నా కిష్టం లేదన్న సంగతి స్పష్టంగా తెలుస్తుంది. అయినా ఈ రోజుల్లో – అందరూ వున్న బాధ్యతలని వదులుకోవాలని చూస్తుంటే – లేని బాధ్యతని కొనితెచ్చుకుంటానంటారేమిటి? వాడు మరీ చిన్నవాడు కాదు – వాడిని తెచ్చిపెట్టుకున్నాక మంచీ వుంటుంది, చెడూ వుంటుంది. ఈ కాలంలో కడుపున పుట్టిన పిల్లలతోనే పడలేకుండా వున్నారు. మనకి లేనిపోని తద్దినం ఎందుకు? ఎవరి కర్మ ఎలా వుంటే అలా పోతారు. ఎంతకని వాళ్ళ బాధ్యత పంచుకోగలరు!??" అంది నిరసనగా.

"అదేమిటి విశాలా!? అది నా తోబుట్టువు. కష్టంలో వుంటే ఆదుకోవలసిన వాడిని, ఆదుకోగలవాడిని. మనకి ఇంకా పిల్లాజెల్లా, బరువూ బాధ్యతలూ లేవు కదా?! అయినా నేను తప్పకుండా వాడిని మన దగ్గర వుంచుకుని చదువు చెప్పిస్తానని చెప్పి వచ్చాను. ఇప్పుడు వెనక్కి తిరగడమెలా?!" అన్నాడు సంశయంగా.

అది చాలు విశాల లాంటి ఆడవాళ్ళకి – పరిస్థితిని తమకి అనుకూలంగా మార్చుకోడానికి.

"దానిదేముంది?! – మీకు మరో రెండు మూడు నెలల్లో ట్రాన్స్‌ఫర్ అవుతుందని, ఆ తర్వాత – తీసుకెళతానని రాయండి. ఆ లోపల ఎవరి పరిస్థితి ఎలా వుంటుందో?" అంది తేలిగ్గా.

రామనాథం విస్మయంతో విశాలని కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు చూశాడు.

ఈ విశాలనేనా తన వదినగా తెచ్చుకోవాలని తెగ ఉబలాటపడిపోయింది శశి?! అనుకున్నాడు. పిల్లలూ, బాదరబందీ లేకుండానే ఇలా వుంది! ఈ లెక్కన ముందు ముందు ఒక్క పూట తిండి పెట్టడానికి కూడా ఇలాగే ఆలోచిస్తుందేమో?! బలవంతంగా తెచ్చిపెట్టి – అనవసరంగా ఆ పసి మనసుని కష్టపెట్టడానికి 'మారుగా చెల్లెలిని ఏదో విధంగా భార్యకి తెలియకుండానే ఆదుకోవాలని నిశ్చయించుకున్నాడు.

దగ్గర దగ్గర ఆరు నెలలు గడిచిపోయాక – ఒక రోజు ఆఫీసు నుంచి వచ్చిన రామనాథానికి కాఫీ ఇస్తూ చెప్పింది విశాల – "అన్నయ్య ఉత్తరం రాసాడండీ!"

"ఏమిటట విశేషాలు?!"

"మా అన్నయ్య కొడుకు సుధీర్‌కి డొనేషన్ కడితే ఇక్కడ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చిందిట. రేపు నాలుగో తారీఖున ఇక్కడ చేరించడానికి వస్తున్నారుట. ఇక్కడ నేనున్నాననే చేర్పించాడుట. 'నువ్వే వాడిని కనిపెట్టుకుని చూడాలి' అని రాశాడు."

"అతను హాస్టల్లో వుంటే నువ్వెలా చూస్తావ్?" ఎక్కడుంటాడని డైరెక్టుగా అడగకుండా తెలివిగా ప్రశ్నించాడు రామనాథం.

"భలేవారే! మన ఇల్లుండగా వాడికి హాస్టల్లో వుండాల్సిన కర్మేమిటి?! ఇంట్లో వుండేది మనిద్దరమేగా?! ఇంత ఇంట్లో వాడొక్కడూ ఎక్కువైపోతాడా ఏమిటి?! నాకూ కాస్త కాలక్షేపంగా వుంటుంది" అంది అదంత కష్టమేమీ కాదన్న ధోరణిలో.


'ఔరా! మనసా?!' అనుకున్నాడు ఆశ్చర్యంగా రామనాథం.

"చూడు విశాలా?! నీ ఇష్టం ఎలా వుంటే అలాగే కానీ – కానీ అతను మనింట్లో వున్నా పేయింగ్ గెస్ట్‌లా మాత్రమే వుండాలి. నెల నెలా ఖచ్చితంగా నాకు డబ్బు ఇచ్చేలా ఏర్పాటు చెయ్యి. ఎందుకంటే ప్రస్తుతం నేనున్న పరిస్థితిలో ఒక మనిషిని తేరగా పోషించే స్థితిలో లేను. చాకిరీ నీ ఇష్టం. తేడా రావడానికి వీల్లేదు" నిక్కచ్చిగా చెప్పాడు.

బిత్తరపోయింది విశాల.

"ఎలాగండీ?! మా అన్నయ్యని ఎలా అడగను?! అయినా మనవాళ్ళని మనం కాకపోతే ఊళ్ళో వాళ్ళు ఆదుకుంటారా?! ఏదో కొన్నాళ్ళు తిప్పలు పడితే..." అంటూ, రామనాథం మొహంలో నిరసన భావం స్పష్టంగా కనిపిస్తూంటే సగంలో ఆగిపోయింది.

"ఒకవేళ నువ్వనుకున్నదే జరిగితే ... ఆరు నెలల క్రింద నువ్విచ్చిన సలహా – ఆచరణలో పెడతాను" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా బయటికి నడిచాడు.




## నిద్ర–సుఖం

సంజీవ్ కుమార్ ఒక రోజు అమితాబ్ బచ్చన్‌ను కలుసుకుని "ఏం భాయీ, ఎలా వుంది జీవితం?" అని అడిగాడు. అంతటితో ఊరుకోకుండా–"పెళ్ళయ్యాక మీ ఇద్దరిలో ఎవరికి బాగా నిద్రపడుతోంది?" అని కూడా అడిగాడు.

"ఇద్దరికీ శుభ్రంగా నిద్ర పడుతోంది. మా ఆవిడ ఇంట్లోను, నేను స్టూడియోలోను హాయిగా నిద్రపోతున్నాం" అని జవాబు చెప్పాడు అమితాబ్ ఆవలిస్తూ.

## తేడా

"మా ఆవిడ అచ్చు రిషీకపూర్‌లా వుంటుందంటే నమ్ము." అని సంబరపడిపోతూ చెప్పాడో చండీదాసు తన మిత్రుడితో.

"అలాగా..." అని ఆ మిత్రుడు ఆశ్చర్యపోయాడు.

"ఒక్క మీసాలు తప్ప ఇద్దరి పోలికలూ ఒక్కటే!"

"అదేమిటి? రిషీకపూర్‌కి మీసాల్లేవుగా."

"నిజమే. కానీ మా ఆవిడకున్నాయి" అన్నాడు చండీదాసు చల్లగా.




## షార్ట్‌హాండ్

పద్మనాభం దర్శకత్వం వహిస్తున్న ఒక సాంఘిక చిత్రం సెట్‌లో 'రెడీ ఫర్ టేక్' అనబోయి ఆగి "చూశారా, మా కాస్ట్యూమ్స్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంటు తెలివితేటలు. హీరో దగ్గర 'షార్ట్‌హాండ్' డిక్టేషన్ తీసుకునే చిన్న పాత్ర ఆ అమ్మాయిది అని చెబితే, ఆమెచేత 'పొట్టి చేతులు'న్న జాకెట్ తొడిగించి పంపించాడు చూడండి!" అని విరగబడి నవ్వసాగాడు.

– బద్దిగం పాండురంగారెడ్డి,